# ఈ బహుమతి ఎవరికి?

"అబ్బబ్బ! ఈ ట్రాన్స్‌ఫర్ల ఉద్యోగం అంత అవస్థ అదేకాని మరోటిలేదు!" అంది ఉమ అలమారుల్లో సామాన్లు సర్దుతూ.

"ఏవిటి రాణీగారు సామాన్లు సర్దుతూ సణుక్కుంటు న్నారు?" అన్నాడు హాల్లోంచి వంటింట్లోకి నవ్వుతూ వచ్చిన ప్రసాద్.

"మీకు చిరునవ్వుగానే ఉంటుంది. ఏడాదికి ఒక మారు ట్రాన్స్‌ఫర్ అంటూ కాగితం ఒకటి పట్టుకొస్తూ ఉంటారు. ఈ సామాన్లతోటీ చంటి పిల్లలతోటీ ఊరూరా తిరగలేక చస్తున్నాను" అంది తను ఉడుకుమోతు తనంతో.

"ఇదిగో చూడు ఉమా! నువ్విలా విసుక్కున్నంతలో ట్రాన్స్‌ఫర్లు తప్పుతాయి అంటావా? గవర్నమెంటు ఉద్యోగికి రెండు మూడేళ్ళకి ట్రాన్స్‌ఫర్ అనేది, అవశ్యంగా ఎదు రయ్యే ఒక ఇబ్బందితో కూడిన ఇంపైన మార్పు. దీన్ని మనం సరదాగా తీసుకోవాలి కాని సీరియస్‌గా పట్టించుకొని బాధపడి పోకూడదు."

"ఇందులో సరదా ఏం ఉందండీ నా మొహం!"

"అమ్మమ్మ అలా అనకు. ఉద్యోగంలో చేరిన ఈ ఏడెనిమిదేళ్ళలోనూ ఎన్ని ఊళ్ళు చూశాం అంటావు? ఎంత మంది కొత్త కొత్త ఫ్రెండ్స్ తయ్యారయ్యారంటావు? ఇన్ని ఊళ్ళల్లోనూ, కలిసి ఊళ్ళు చూడ్డం, కొత్త కొత్త ప్రదేశాలు దర్శించడం, కొత్త కొత్త మనుష్యులతో పరిచయాలు సంపాదించడం, వీటి అన్నిటికీ మనం పైసా ఖర్చు పెట్టక్కర్లే కుండా గవర్నమెంటువారు టి. ఏ. అనే పేరుతో మనకి సౌకర్యం ఏర్పాటు చేసి, ట్రాన్స్ఫర్ అనే పేరుతో యాత్రలకి పెర్మిషన్ ఇస్తూంటే ఇంత కంటే ఏం కావాలి? ఇన్ని ఊళ్ళు చూసి ఇంత మంది ఫ్రెండ్స్‌ని సంపాదించడానికి మనకి ఈ పాటికి ఎంత ఖర్చు అయేది అంటావు?"

"మీరు ఇలాంటి కబుర్లు చెప్పకండి నాకు వళ్ళు మండు కొస్తోంది."

"ఇంకా నయం మా అక్కయ్యా వాళ్ళకి వారం పది రోజుల క్రితమే ఈ ఊరునుంచి ట్రాన్స్ఫర్ కావడం, వెతుక్కోనక్కర్లేకుండా వాళ్ళు ఖాళీచేస్తూన్న ఇల్లే మనకి వాళ్ళు అద్దెకి ఇప్పించడంవల్ల, ఇల్లు వెతుక్కునే బాధ ఒకటి తప్పింది మనకి కొత్త ఊళ్లో. లేకపోతే ఈ విశాఖపట్నం మహాపట్నంలో ఇల్లు దొరికి ఉండేదా? ఇంత వరకూ నయం కదా అని సంతోషించాలి."

"ఏం సంతోషం అండీ. ఇల్లు దొరగ్గానే అయిందా? పాలవాళ్ళూ పనివాళ్ళూ సరియైన మనుష్యులు కుదరాలి.

పిల్లలకి దగ్గర కాన్వెంటుల్లో సీట్లు దొరకాలి. ఇరుగూ పొరుగుని మంచి చేసుకోవాలి ."

"అబ్బబ్బ. అన్నీ అవుతాయి. నా మాట విను. జీవితంలో ఇబ్బందుల్ని ఇంపైన సంఘటనలుగానూ, సమస్యలని సరదా అయిన సవాళ్ళగానూ తీసుకోపోతే ఆనందంగా బ్రతకలేం. విసుగూ కోపం మనల్ని మోసగించి మనలో ప్రవేశించి వేరుపురుగు దొలిచినట్లు దొలిచేస్తాయి."

"సర్లెండి మీ గీతోపదేశం మీరూను. ఒక్క పని సాయం చెయ్యరుగాని ఉపదేశాలు ఉపన్యాసాలూ మాత్రం దంచుతారు. ఈ పెద్ద డబ్బాలు రెండూ ఆ పై అలమారులో పెట్టండి. నాకు అందడం లేదు."

"చూశావా పొట్టివల్ల నష్టాలు!"

"ఆ. మీ పొడుగువల్ల లాభాలు చూస్తున్నాంగా రోజూ. తలకి ద్వారబంధాలు తగిలి బొప్పెలు కట్టడం." అంటూ ఉమ నవ్వింది. ప్రసాద్‌కూడా పకపకా నవ్వేశాడు.

సాయంత్రం ప్రసాద్ ఆఫీసునుంచి వచ్చేసరికి ఉమ నవ్వుతూ ఎదురువచ్చి "ఓ మంచి వార్త" అంది.

"స్టేట్ లాటరీ ఏదైనా ఫస్టు ప్రైజ్‌వచ్చిందేమిటి కొంపదీసి"అన్నాడు "ఉఫ్" అని కుర్చీలో కూర్చుంటూ ప్రసాద్.

"అబ్బాబ్బా. మీకెప్పుడూ డబ్బు రంధి తప్ప మరోటి లేదు కదా" అంది ఉమ కనుబొమలు చిట్లించి.

"ధనప్రాప్తి అనేవార్త కాకపోతే ఇంక ఏదైనా మనకి సాదావార్తే!....ఊ....చెప్పు" అన్నాడు ప్రసాద్ ఏ కాలి మేజోడుతీసి ఆ కాలికి సంబంధించిన బూటులో పెడుతూ.

"మాలతిగారు వచ్చిందండీ...."

"ఆవిడెవరు?...."

"అదే మీ అక్కయ్య అప్పుడప్పుడు చెబుతూ ఉండేవారు కదా- విశాఖపట్నంలో నాకు మాలతి అని ఫ్రెండ్ ఉండి, నేనంటే భలే ప్రాణం. వారం రోజులు నన్ను చూడకపోతే ఉండలేదు. మేం ఇద్దరం కలిసి భీమిలీ, హార్బర్, సింహాచలం వెళుతూ ఉండే వాళ్ళం అని...."

"అవునవును .. నాకూ ఒకటి రెండుసార్లు వాళ్ళ పిక్‌నిక్స్ గురించి చెప్పి బోర్ కొట్టించింది....ఆ మాలతిగారా ఇప్పుడు వచ్చింది? సరే....బాగానే ఉంది.... అవునూ?.... నిన్నేం ఎరుగును ఆవిడ? మనం ఈ ఊరు వచ్చాం అని అసలు ఆవిడకి ఎలా తెలుసు?"

"నేనూ అదే విస్తుబోయాను మొదట- తర్వాత తెలిసింది, మీ అక్కయ్య ఉత్తరం రాసిందిట నిన్న-ఇలా మా తమ్ముడికి వైజాగ్ ట్రాన్స్‌ఫర్ అయింది. మేం ఖాళీ

చేసిన ఇంట్లోనే ఉంటున్నారు. కొత్తవూరు. మా మరదలికి ఎవరూ పరిచయం లేరు అక్కడ. నువ్వెళ్ళి కాస్త చూస్తూ ఉండు—అని...."

"ఇహనేం? ఈ కొత్త ఊళ్ళో నీకు రెండు రోజులు తిరక్కుండానే ఒక మంచి ఫ్రెండ్ దొరికిందన్నమాట. చూశావా? విసుక్కున్నంతసేపు పట్టలేదు - ఏవిటో కొత్త ఊరు, కొత్త వాతావరణం, కొత్త మొహాలు- అంటూ ఏక యిదయ్యావు" అని ప్రసాద్ బట్టలు మార్చుకోడానికి పడక గదిలోకి వెళ్ళాడు.

వెనకాలే వెళ్తూ "ఫ్రెండ్ సరే—రేపు ఆదివారం మన ఇద్దర్నీ వాళ్ళింటికి కాఫీకి పిలిచింది" అంది ఉమ.

బనీను విప్పుకుంటున్నవాడల్లా ఆ మట్టున ఆగిపోయి "మన ఇద్దర్నీనా.... నన్ను కూడానా?" అన్నాడు ప్రసాద్.

"అవును. ఏం?"

"అహ....అదికాదు....అయనవచ్చి పిలవకుండా ఆవిడ రమ్మన్నంతలో నేనుకూడా నీతో బయల్దేరివస్తే...." అంటూ అర్థోక్తిలో ఆగి పోయాడు ప్రసాద్.

"ఏం? వస్తే! తప్పేవిటి? ఇదే మీ మగవాళ్ళకున్న బెట్టు —మీ ఫ్రెండ్స్ ఇంటికి తీసుకెళితే మీతో నేనూ రాలేదూ

ఎన్ని మాట్లో— ఆడవాళ్ళువచ్చి పిలవలేదనీ వాళ్ళెవరో నాకు తెలియదనీ ఇలా బెట్టుచేశానా...."

"సరేనయ్యా. అలాగే వస్తాలే. ఇంతకీ ఎక్కడేవిటి వాళ్ళ ఇల్లు?"

"ఎక్కడో చెప్పిందండి ఆనమాలు."

"ఎడ్రస్ తీసుకోలేదా?"

"ఊహుఁ"

"సర్లే-ఎక్కడో తెలియకుండా, ఎవరింటికని బయలు దేరుతాం?" అని ప్రసాద్ విసుక్కున్నాడు. ఉమ మొహం ఇంత చేసుకుని చిన్న బుచ్చుకుంది.

తర్వాత ఎన్నో ఆదివారాలు గడిచాయి.

ఓ ఆదివారంనాడు సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో మాలతి, ఉమా ప్రసాదుల ఇంటికి వచ్చింది. జరీ చీర కట్టుకుని చేతిలో కుంకం భరిణె పట్టుకుని మెట్లు ఎక్కుతూన్న మాలతిని చూసి ఉమ నవ్వుతూ "రండి.... రండి" అంది.

"అవును. మీరు మా యింటికి వచ్చారు కాదేం?" అంది మాలతి కంఠంలో కొంచెం నిష్ఠూరం ధ్వనింపజేస్తూ.

"అప్పుడాండీ.... అప్పుడూ..." అంటూ నీళ్ళు నమి లింది ఉమ.

"మీవారు లేరా ఇంట్లో?" అంది మాలతి ఇటూ అటూ పరిశీలిస్తూ.

"లేరండి. ఆఫీసులో ఏదో పని ఉందని ఇప్పుడే కాఫీ తాగి అల్లా వెళ్ళారు."

"సరే-వచ్చే ఆదివారం మా అమ్మాయి పెళ్ళి. మీరూ మీ వారూ ప్రొద్దునే కాఫీలకే అక్కడికి వచ్చెయ్యండి. మా వారు కూడా వచ్చారు. బయట రిక్షాలో కూర్చునారు. ఉండండి. ఆయన్ని అడిగి శుభలేఖ పట్టుకొస్తాను. లోపలికి రమ్మంటే ముందు ఆయన ఉన్నారో లేదో చూసిరా అని రిక్షాలోనే కూర్చుండి పోయారు. మీవారు లేరంటే ఇంక అసలు లోపలికిరారు. తగని మొహమాటం సిగ్గూను" అంటూ గబగబా మాట్లాడేసి వీధిలోకి వెళ్ళి వాళ్ళ ఆయన్ని అడిగి శుభలేఖ పట్టుకొచ్చి ఇచ్చి, బొట్టు పెడుతూ మళ్ళీ అంది మాలతి "పెళ్ళికి తప్పకుండా రావాలి. మీ ఆయన్ని తీసుకుని మరీను. మీ ఆడబడుచుకి శుభలేఖవేశాను. వస్తే ఆవిడ కూడా వస్తుంది"

ఓ ప్రక్కనుంచి వేళ్ళతో కుంకంబొట్టు సరిజేసుకుంటూ మరో ప్రక్కనుంచి శుభలేఖలో ఉన్న కళ్యాణ మండపం

పేరు, ఒకటికి రెండుసార్లు కూడబలుక్కుని చదువుకుంటూ "అలాగే వస్తాం. తప్పకుండా" అంది ఉమ.

ఆ రాత్రి ఉమ, ప్రసాద్‌కి జరిగిందంతా చెప్పి "ఉండండి శుభలేఖ తెస్తాను. అలమారులో పెట్టాను" అంటూ మంచం మీంచి లేవ బోయింది.

"జాగ్రత్త చేశావు కదా, పొద్దున్న చూసుకుందాంలే" అంటూ ఆమె జబ్బపట్టుకొని ఆపాడు ప్రసాద్.

"తప్పకుండా వెళదాం అండీ పాపం, ఆవిడ మరీ మరీ చెప్పింది. ఆయన కూడా వచ్చారు. మీరు ఇంట్లో ఉంటే పిలుద్దాం అనీ...."

"అలాగే వెళదాం అన్నానుగా" అంటూ ప్రసాద్ లైటు ఆర్పి ఫేన్ స్విచ్ వేశాడు.

అనుకున్న ప్రకారం శనివారం సాయంత్రమే పెళ్ళి కూతురికి బహుమతిగా ఇవ్వడం కోసం స్టీలు ప్లేటూ కప్పూ పట్టుకొచ్చాడు ప్రసాద్. తీరా ఆదివారం ప్రొద్దుటే పిల్లల కిద్దరికీ నీళ్ళుపోసి మంచి బట్టలు తొడిగి తను పట్టుచీర కట్టుకుని ఉమ ముస్తాబయేసరికి, కుర్చీలో కూర్చుని బద్ధకంగా వళ్ళు విరుచుకుంటూ "నేను రావాలంటావా?" అన్నాడు ప్రసాద్.

"అదేవిటండీ మళ్ళీ?" అంది ఉమ నిరుత్సాహంగా.

"అదికాదు ఉమా? నీకు కనీసం ఆవిడ ఒక్కరేనా తెలుసు, నాకు ఎవరూ తెలియదు. ఎలా రావడం ఈ పెళ్ళికి? నాకు మొహమాటంగా ఉండదూ? పోనీ నువ్వు వెళ్ళు పిల్లల్ని నేను చూస్తాను." అన్నాడు ప్రసాద్. ఉమకి ఉడుకుమోతు తనం వచ్చింది. "మీ మగవాళ్లు ఎప్పుడూ ఇంతే. పోనీ సరదా పడుతోంది తీసుకు వెళదాం అని లేదు" అంది.

"మగవాళ్ళని అందరినీ కలిపి అనేస్తున్నావు. ఎంత మంది మనస్తత్వాలు తెలుసేవిటి నీకు?" అన్నాడు ప్రసాద్ కొంటెగా.

"ఒక మాటంటే పది అర్థాలు తీస్తారు" అని అలిగి అక్కడనుంచి వెళ్ళబోయింది ఉమ.

"సరే నడు" అంటూ పిల్లల్ని తీసుకుని ప్రసాద్ ఉమా సమేతుడై బయలుదేరబోయి వెంటనే ఆగి, "ఏది? ఆ శుభలేఖ ఏది?" అన్నాడు.

ఉమ అలమారంతా వెదికింది. శుభలేఖ కనిపించలేదు. రేడియో ప్రక్కని చూసింది. ఉహుఁ!.... పరుపు క్రింద దాచిన జ్ఞాపకం అంటూ పరుపు తిరగేసింది. మళ్ళీ అలమారు దగ్గిరికి వచ్చింది.

వెదకడంవల్ల నుదురంతా చెమటపట్టి ముఖాన రాసు కున్న పౌడరు చారికలుగా మారడం చూసి జాలితో "ఊ....

సరే... శుభలేఖ లేతపోతే ఏం లే—మొత్తానికి వెంకటేశ్వర కళ్యాణమంటపం అని గట్టిగా జ్ఞాపకమేనా?" అన్నాడు ప్రసాద్.

"అవునండీ—నాకు బాగా జ్ఞాపకం—అయితే అది ఎక్కడుందో మరి...."

"ఆ సంగతి రిక్షావాడో ఆటోవాడో చూసుకుంటాడు. నువ్వు ముందు ఇంటికి తాళంవేసి బయల్దేరు........"

ఉమా ప్రసాద్ ఆటో రిక్షా వాడికి డబ్బులిచ్చి ఇద్దరూ చెరో కుర్రాడినీ తీసుకుని వెంకటేశ్వర కళ్యాణమంటపం ముందున్న షామియానాలోకి అడుగు పెడుతుండగానే ఒక శ్శిద్దరు మగవాళ్ళువచ్చి ప్రసాద్‌ని మగవాళ్ళు కూర్చున్న కుర్చీల దగ్గరకు తీసికెళితే ఇద్దరు అమ్మాయిలువచ్చి ఉమని మరోవైపు తీసుకెళ్ళారు. అంతా కొత్తవాళ్ళు. తెలిసినవాళ్లెవరూ ఉండరని ముందే సిద్ధం కావడంవల్ల ఉమ, ప్రసాద్ ఏం ఇబ్బంది పడలేదు. ఉమ మాత్రం మాలతిగారు ఎప్పుడు కనిపిస్తారా అని ఎదురు చూస్తోంది.

కాఫీ ఫలహారాలు పుచ్చుకోవడం అయింది.

పిల్లలిద్దరూ ఉమ ప్రసాద్‌ల మధ్య వారధిలా తిరుగుతున్నారు.

పట్టు చీరలూ టెర్లిన్ ప్యాంటులూ, జరీ చీరలూ అటూ ఇటూ హడావిడిగా కదులు తున్నాయి. కబుర్లు, కేకలు, హెచ్చరికలు-జోక్స్-లోకాభిరామాయణం - పకపకలు - మల్లె పువ్వుల వాసనలు అగరు వత్తుల పరిమళాలు. ఓహ్! పెళ్ళి హడావిడి ఘూమ్మంటూ ఉంది.

బేండ్ వాళ్ళు హెచ్చుస్థాయిలో పాట అందుకున్నారు.

ఎదురుగా పెళ్ళికోసం అని అందంగా కట్టిన చిన్న మందిరం, ఖాళీగా ఉంది. ఇంకా పెళ్ళి కూతురూ, పెళ్ళి కూతురు తల్లీ తండ్రీ, పెళ్ళి కొడుకూ లోపలినుంచి ఇవతలకి రాలేదు. పురోహితుడు మాత్రం పీటలూ పళ్ళేలూ సర్దు తున్నాడు.

తెలిసిన వాళ్ళెవరూ లేక, ఎవరితో మాట్లాడాలన్నా మొహమాటపడుతూ ఉమ ఇబ్బందిగా వుంది కాని, అక్కడ ప్రసాద్ మాత్రం చూట్టూ వున్న నలుగురైదుగురితో మాటలు కలిపి హుషారుగా కబుర్లు చెబుతూ నవ్వుతూ కాలక్షేపం చేసేస్తున్నాడు.

ఉమని చూసి "ఆడ పెళ్ళివారితరఫు కాబోలు" అను కుంది ఒకామె, మరొక ఆమె "మగ పెళ్ళివారి తరఫేమో" అని పలకరించడానికి జంకింది.

మాలతిగారు కనిపిస్తే బాగుండును. ఎలాగా కన్యా దానపు పీటల మీదకి వచ్చి కూచుంటారుగా?" అనుకుంటూ

ఇటూ అటూ కుర్చీలో ఇబ్బందిగా కదులుతూన్న ఉమ కళ్లు హఠాత్తుగా పెళ్ళి మందిరంవైపు తిరిగి ఆ మట్టున అక్కడ ఆగిపోయాయి.

పెళ్ళి కుమార్తెని తీసుకువచ్చి కూర్చో బెట్టారు.

ఆమె ప్రక్కనే ఆమె తల్లి దండ్రిలు కూడావచ్చి కూర్చున్నారు.

అడ్డంగా కట్టిన తెర అవతల పెళ్ళి కొడుకు కూర్చుని ఉంటాడు.

కాని....కాని....పెళ్ళి కుమార్తె ప్రక్కని కూర్చున్న ఆమె మాలతిగారు కాదే! మళ్ళీ మళ్ళీ పరకాయించి చూసింది ఉమ.

అబ్బే. ఆవిడ మాలతిగారు కాదు....అనుమానంలేదు. మరయితే. ఇది ఇంకో పెళ్ళా? మాలతిగారు చెప్పిన కళ్యాణమంటపం ఇది కాదా? అయినా అనుమాన నివృత్తి కోసం ఉమ తన ప్రక్కన కూర్చున్న ఒక ముత్తైదువని అడిగింది "పెళ్ళికూతురు ప్రక్కని కూర్చున్న ఆవిడ ఎవరండి?" అంటూ.

ఆవిడ ఉమని ఎగాదిగాచూసి "అదేవిటమ్మా అలా అడుగుతావు? ఇంకెవరు కూర్చుంటారు ప్రక్కని? ఆ అమ్మాయి తల్లే ఆవిడ. మీరు మగ పెళ్ళివారి తాలూకా?" అంది.

ఉమకి తేళ్ళూ జెర్రిలు పాకాయి.

మగవాళ్ళు కూర్చున్నవైపు పరకాయించి, ప్రసాద్‌కి చేత్తో సంజ్ఞ చేసింది ఉమ "లేవండి వెళ్ళి పోదాం" అని.

ప్రసాద్ చూశాడు కాని ఏం సమాధానం ఇయ్యకుండా అటు తిరిగి ఎవళ్ళతోటో పకపక నవ్వుతూ మాట్లాడుతున్నాడు. కొడుకు ద్వారా కబురుచేసింది "అమ్మ పిలుస్తోంది. అలా ఓమాటు రమ్మంటోంది" అని.

"ఊహు. నేను రాను" తిరిగి కబురుచేశాడు. ఉమకి మతి పోయింది. అసలు పెళ్ళికే రానన్న పెద్ద మనిషి ఇలా మొండికేసుకుని కూచున్నా రేవిటి చెప్మా అని. ఏదోమాట చెప్పాలట. అమ్మ ఎందుకో రమ్మంటోంది అని మళ్ళీ మళ్ళీ కబురు చేశాక విసుగ్గా కుర్చీలోంచి ప్రసాద్ లేచాడు. జనం ఎక్కువగాలేని ఒక మూలకివచ్చి నుంచుంది ఉమ. ఆమెని సమీపిస్తూనే విసుగ్గా "ఏవిటి ఇందాకటినుంచీ ఆ సంజ్ఞలూ కబుర్లు పంపడాలూను?" అన్నాడు ప్రసాద్.

"మనం మాలతిగారి ఇంట్లో పెళ్ళికి కాదండీ వస్తా."

"నీకేమైనా మతిపోయిందా ఏవిటి?"

"అవునండీ. ఇది ఇంకెవరింట్లో పెళ్ళో."

"ఇది వెంకటేశ్వర కళ్యాణ మంటపమేకదా. ఇక్కడే అని కదా నువ్వు చెప్పింది?"

"నేను ఆపేరు విషయంలో ఏదో పొరబాటుపడి ఉంటాను."

"అయితే ఇప్పుడేం చెయ్యమంటావు?"

"పోదాం పదండి."

"ఎక్కడికి?"

"ఇంటికి."

"ఊహుఁ.... నేను రాను. పెళ్లికంటూ బయలుదేరాం. బహుమతి కూడా తీసుకుని వచ్చాం. ఇంక వెనక్కి వెళ్ళేది లేదు. మాలతిగారి అమ్మాయి కానీ మరో మనోహరంగారి అమ్మాయి కానీ. ఎవరైతే ఏం కాక? పెళ్ళి అయేదాక ఉండవలసిందే. పెళ్ళికూతురికి తెచ్చిన బహుమతి ఇచ్చి వెళ్ళవలసిందే!"

"ఇదేం మంకుపట్టు అమ్మా. సంబంధం లేని వాళ్ళె వరకో బహుమతి ఇస్తాం అంటారు. అసలా చుట్టూ కూచున్న మగాళ్ళెవరో మిమ్మల్ని పొగుడుతున్నారనుకుంటాను. అందుకే ఉబ్బి తబ్బిబ్బయి పెళ్ళి అయేదాకా ఉందామనీ, పెళ్ళికూతురికి బహుమతి ఇద్దామనీ అంటున్నారు. లేకపోతే ఈ పెళ్ళికీ మనకీ సంబంధం ఏమిటి?" అంది ఉమ కోపంగా.

"పోనీ అలాగే అనుకో" అని పెంకితనంగా అనేసి, మళ్ళీ తను కూర్చున్న చోటువైపు అడుగు కదిపాడు ప్రసాద్.

ఇంతలో పందిట్లో ఒక్క ఉరుము ఉరిమి మెరుపు మెరిసినట్లయింది. కళ్యాణమంటపంలో ఏదో ప్రళయం వచ్చినట్లు అంతా గందరగోళంగా ఉంది. "అంతా ఇలా కంగారుగా లేచి నుంచుంటున్నారేవిటి చెప్మా" అని ఉమా ప్రసాదులు అటు చుశారు.

పద్దెనిమిది ఇరవై ఏళ్ళ అమ్మాయి.

సామాన్యమైన అందంతో ఆకర్షణీయంగానే ఉంది. కోపంతో మొహం అంతా జేవురించి బుగ్గలు అదురుతూ పెదవి కంపిస్తోంది. కళ్ళు రెండూ మాత్రం వచ్చే కన్నీటిని ఆపుకోవడం వల్ల నీటికుండల్లా ఉన్నాయి.

కళ్యాణ మంటపంలో పెళ్ళికొడుక్కి పెళ్ళికూతురికి మధ్య నిలబడి ఏదో గట్టిగా చెప్తోంది.

ఆమె కంఠంలో ఓమారు దైన్యం, ఓమారు క్రోధం, ఓమారు దుఃఖం, అవమానం మార్చి మార్చి వినిపిస్తున్నాయి అందరితోబాటు ఉమా ప్రసాద్ ఇద్దరూ కూడా ఆ అమ్మాయి చెప్పేది శ్రద్ధగా వినసాగారు.

"అయ్యా అంతా దయచేసి వినండి. ఇప్పుడు పెళ్ళి కొడుకుగా ఈ పీటలమీద కూచున్న రామారావు, అయిదారు

సెలల క్రితం దాకా మా ఊళ్లో రాంబాబుగా వుద్యోగంచేస్తూ వుండేవాడు. అప్పుడు మా యింట్లోనే ఒక గదిలో వుంటూ మంచి మాటలతో మా అమ్మని నమ్మించి నన్ను పెళ్లి చేసు కుంటానని మోసగించాడు...."

"ఆ...." అంటూ పెళ్లి కూతురుతో సహా పందిట్లో వున్న వాళ్లంతా విస్తుబోయి పెళ్లి కొడుకు వైపు చూశారు.

"నాకిది ఎవరో తెలియదు." అన్నాడు పెళ్లి కొడుకు బింకంగా.

"ఏవిటి తెలియదూ? నా మొహంకేసి చూపి మాట్లాడు....నన్ను బీచ్‌కీ, పిక్నిక్‌లకీ, సినీమాలకి తీసికెళ్ల లేదూ? తప్పకుండా పెళ్లి చేసుకుంటానని నువ్వు నాకీ ఉంగరం ఇవ్వలేదూ?" అంటూ ఆమె తన వేలిన వున్న పేరు చెక్కిన వుంగరం అతనికి చూపించింది.

పెళ్లి కొడుకు ఆ వుంగరాన్ని చేజిక్కించుకొనే లోపుగా, పెళ్లి కూతురు చటుక్కున ఆ ఉంగరాన్ని లాక్కుని దాని మీద 'రాంబాబు' అని రాసి వున్న అక్షరాలని పరిశీలించ సాగింది.

పెళ్లి కొడుకు "అబద్ధం" అంటూ ఇబ్బందిగా అరిచాడు....

"అయితే ఇది అబద్ధమేనా? నువ్వూ నేనూ కలిసి తీయించుకున్న ఫోటో" అంటూ జాకెట్‌లోంచి ఒక ఫోటో తీసింది. వెంటనే పెళ్ళి కొడుకు పీటలమీంచి కోపంగా లేచి ఆమె చేతిలోంచి ఫోటో లాక్కొని రెండు ముక్కలుగా చింపేయ బోతూంటే పెళ్ళికూతురు "ఆగు" అంటూ అపర దుర్గలా అరిచింది.

పెళ్ళి కొడుకుతోబాటు పెళ్ళి వాళ్ళంతా ఆమె కంఠం లోని తీవ్రతకి అదిరిపడ్డారు.

"మీరంతా పెద్దలు. ఈ పెళ్ళి జరిగితే నాకు పెద్ద అన్యాయం అయిపోతుంది. అమ్మా, నీ పెళ్ళికి అడ్డం వచ్చానని ఏం అనుకోకు- ఈ పెద్ద మనిషి మొదట నా భర్త అయ్యాకే- నీ భర్త అవుతున్నాడమ్మా. నా పరిస్థితి ఆలోచించు... కాదూ కూడదంటే నీ చేతుల్తో నాకు కాస్త విషం ఇచ్చి ఆ పైన ఇతని చేత తాళి కట్టించుకో" అంటూ ఆ అమ్మాయి వలవలా ఏడ్చేసింది.

ఒక్క క్షణం ఆగి వెంటనే పీటలమీంచి పెళ్ళికూతురు లేచింది. లేచి "అమ్మా.... మరేం ఫరవాలేదు....కూర్చో... నా స్థానంలో అలా కూర్చో" అంది గంభీరంగా,

ఎవరికీ ఏం అర్థం కాలేదు.

"వాయించండోయ్ భజంత్రీలు" అంది పెళ్ళికూతురు.

అందరూ ప్రమాన్పడి చూస్తున్నారు.

దిక్కులు చూస్తూ కంగారు పడుతూ అక్కడినుంచి మొహం చాటెయ్యడం ఎలాగా అని ఆలోచిస్తూన్న పెళ్లి కొడుకుని గద్దిస్తూ "ఊ-కట్టవయ్యా. ఆ అమ్మాయి మెళ్ళో తాళికట్టు" అంది పెళ్లి కూతురు.

పెళ్లికొడుకు తటపటాయించాడు.

మర్యాదగా, కట్టు"—ప్రళయ గర్జనలా ఉంది ఆమె కంఠం.

అంతే.... పెళ్ళి కొడుకు కిక్కురుమనలేదు.

"అందరూ అక్షింతలు జల్లండి."

ఈ మారు కిక్కురు మనకుండా చెప్పినట్లు చెయ్యడం, చుట్టూ నుంచున్న పెద్దలవంతు అయింది.

"వెయ్యి, అక్షింతలు" అన్నాడు నవ్వుతూ ప్రసాద్.

"చాల్లెండి నడవండి. మంచి పెళ్లికివచ్చాం" అంది ఉమ విసుగ్గా.

"నిజంగా మంచి పెళ్లికే వచ్చాం. ఇదిగో ఈ బహుమతి పట్టికెళ్లి ఇయ్యి" అంటూ ప్రసాద్ ఉమ చేతిలో కప్పూ ప్లేటూ ఉంచాడు.

"ఎవరికీ? ఈ కొత్త పెళ్ళి కూతురికా?"

"అబ్బెబ్బే-తాళికట్టించుకున్న ఈ అమ్మాయికి కాదు. సాటి స్త్రీ బాధని అర్థంచేసుకుని మనోబలంతో తగిన సమయంలో తగిన నిర్ణయం తీసుకొని, ఇలాంటి మోసగాడికి తగిన గుణపాఠం నేర్పిన, ఆ పెళ్లి తప్పిపోయిన పెళ్లి కూతురికి" అన్నాడు ప్రసాద్.

"పెళ్లి తప్పిపోయిన పెళ్ళి కూతురికి ఏవిటి?" అని ఒక్క క్షణం అనిపించినా, మళ్ళీ అదే సమంజసం అయిన నిర్ణయం అని నిశ్చయించుకుని, "రండి ఇద్దరం పట్టి కెళ్ళి ఇద్దాం" అంది ఉమ, ఒక పెళ్ళి కూతురికి అని తెచ్చిన బహుమతిని, మరో పెళ్ళి ఆగిపోయిన పెళ్ళి కూతురికి అభినందన పూర్వకంగా అందించడానికి.

(జ్యోతి)